చిన్న కథ

# నేను పేరెందుకు మార్చుకున్నానంటే!

నేను కథలు చాల గొప్పగానే రాస్తాను. కాని అవి వేసే నాథుడే మూడులోకాల్లోనూ ఎక్కడా కనిపించటంలేదు.

పుస్తక ప్రచురణ కర్తలు ఉన్నారంటే — వారు ఎంతసేపటికీ శరత్ బాబునో, బంకింబాబునో, ఖూనీ (తర్జుమా) చేయించి లాభాలు గడించాలనుకుంటారేగాని — నావంటి వర్తమాన ఆధునిక కథకులను ప్రోత్సహించి పైకి తీసుకురావాలనుకోరు.

తెనుగు పత్రికా సంపాదకులకు — అదేమి కర్మమో మరి — నేనుకథపంపితే ప్రచురించక పోగా నాకథ నాకు తిరిగి పంపించరు అందుకుగాను నేను పంపే ముక్కాని బిళ్ళలు జేబులో వేసుకొని ఊరుకొంటారు.

ఏ తెనుగు పత్రిక ఆఫీసులోనైనా వెళ్ళిచూడండి: నాకథలు రెండో మూడో వేస్టు పేపరు బాస్కెటులో మూలుగుతూ ఉంటాయి.

నాకు ఒళ్ళుమండిపోదూ మరి? క్రమశః పత్రికా సంపాదకుడూ అంటే అమాంతం హత్యచేసేద్దా మన్నంత కోపం వస్తూండేది. కాని ఆపుకునే వాణ్ణి.

నా కసిదీర స్థానికంగా ఉండే తెనుగు పత్రికా సంపాదకులందరికీ, డౌనింగ్ స్ట్రీట్ ఎడిటర్ అనీ — చెట్టుక్రింది ఎడిటరనీ — పేరు పెట్టేశాను. ఇద్దర్నీ బాగా తిడుతూ ఉత్తరాలుకూడా రాశాను. కాని యేం లాభం? నా కథలు మాత్రం అచ్చువేసేవాళ్ళుకాదు.

చివరకు నా బ్రతుకంటే నాకే అసహ్యం వేయటం మొదలుపెట్టింది. వెధవది ఒక్క కథ పత్రికలో వేయించుకోలేక పోయినవాడు బ్రతికి యేం? ఛస్తేయేం?

ఆత్మహత్య చేసుకోవాలనే తీర్మానం చేసుకున్నాను. "ఎలాగూ ఆత్మహత్య చేసుకుంటున్నావు కాబట్టి, ముందుగా ఒకరిద్దరినైనా జర్నలిస్టు శత్రువులను తుదముట్టించి మరీ చచ్చిపోకూడదూ?—" అంటూ నా అంతరాత్మ ఒక సవరణ ప్రతిపాదించింది. భేష్ బాగానే ఉంది— అనుకున్నాను.

అయితే పిస్తోలు సంపాదించటం ఒక పెద్ద సమస్య ఐపోయింది. బుర్ర బద్దలై పోయేలాగ ఆలోచించాను. చివరకు దైవాద్వారా ఒక పత్రికలో ప్రకటన ఒకటి చూశాను. ఆ కంపెనీవారు పిస్తోళ్ళు సప్లయి చేస్తారుట. ధర చౌకగానే ఉంది. ఇంకో విశేషమేమిటంటే—పిస్తోలుతోకూడా ఒక గడియారం, టార్చిలైటు, ఫౌంటెన్ కలం, ఈ మొదలైన వస్తువులు సుమారు యాభైదాకా ఉచితంగా పంపిస్తారుట. ఆశావహంగానే ఉంది.

వెంటనే కవరు, కాగితం తీసుకొని ఒక మంచి పిస్తోలుకు ఆర్డరు ఇచ్చాను. అయితే నేను ఎలాగూ చచ్చిపోతున్నాను గదా! పిస్తోలుతోకూడా వచ్చే యితరవస్తువుల్ని ఏమి చెయ్యాలి—అను ప్రశ్న వచ్చింది. తుది బహుమానంగా యే మిత్రుడికైనా యిచ్చిపోదాములే అనుకున్నాను.

చివరకు ఒకరోజున బంగీవచ్చింది. వి.పి. చెల్లించి ఉత్సాహంగా బంగీ విప్పాను. వాడు పంపిన వస్తువులు చూడగా నాకు మూర్ఛ వచ్చినట్టయింది. అన్నీ చంటిపిల్లలు ఆడుకోవటానికి పనికివచ్చేవి. పిస్తోలుకూడా అలాంటిదే. అన్నీకలసి ఒక రూపాయి ఖరీదు చేసి ఉండవు.

ఇంత పట్టుదలతో నేను పూనుకున్న ఈ ఆత్మహత్యా ప్రయత్నం ఇలా ఒక పాతిక రూపాయల వృథా నష్టంతో వ్యర్థమైపోయిందని చాల వ్యథ పడ్డాను. ఇలాంటి మోసగాళ్ళ ప్రకటనలన్నీ వేస్తారుగాని నావంటివాని కథ ఒక్కటైనా వెయ్యరుగదా—అని పత్రికలవాళ్ళమీద చాల ఆగ్రహంకూడా వచ్చింది.

రచన : కే. ఆర్.

కాని ఇంతలో రాబర్టు క్లైవు జ్ఞాపకం వచ్చాడు. చచ్చిపోదామనుకున్నా పరలోక ప్రయాణావకాశాలు తప్పిపోతున్నాయి. కాబట్టి నాకుకూడా ఒక ఉజ్వల భవిష్యత్తు ఉందేమోనని ఆశించి సంతృప్తిపడ్డాను.

అనుకున్నట్టుగానే ఆ మర్నాడే ఒక ఉత్తరం వచ్చింది. క్రొత్తగా పత్రిక పెడుతూ ఒక సంపాదకుడు రాసిన జాబు అది. రానున్న మాసంలో వెలువడనున్న తన నూతన పత్రికా రాజంబునకు భూషణప్రాయముగా ఉండదగిన క్రొత్త చెత్త నావద్ద తయారుకాబడినది ఏదైనా ఉంటే పంపవలసినదని రాశాడు.

నా పేరు ఈకొత్త సంపాదకుని లిస్టులోకి ఎలా వెళ్లిందా? అని కొంతసేపు తర్జనభర్జన పడ్డాను. బహుశః నన్నుకూడా ఒక మంచి కథకుడుగా ఎరిగివున్న మిత్రుడెవరైనా చెప్పివుంటాడని ఊహించాను.

నా మేనమామ ఒకాయన ఉన్నాడు. ఆయనకు బూర్జువా లక్షణాలు చాల ఉన్నాయి. ఆయన నన్ను అనేక సార్లు అనేక విషయాల్లో మోసం చేశాడు. అదంతా ఒక చక్కని కథగా రాశాను.

తీరా పోస్టులో వేయబోతూంటే ఎవరో తుమ్మినాడు. అనుమానం కలిగింది. ఇదికూడా వేస్టు పేపరు బాస్కెట్ కే బలికావలసిందేనా?

సమయానికి ఒక మంచి ఉపాయం తట్టింది. ఇంతకూ ఈకథ కొత్త పత్రికలో ప్రచురితం కావలసిన యోగ్యత ఉంది కాబోలు!

కవరులోనుంచి రాతప్రతి బైటికి తీశాను. దానిమీద "ఇది సుప్రసిద్ధ రష్యన్ రచయిత ఛకోవ్ రాసిన కథకు అనువాదం" అని రాసి—నిర్భయంగా పోస్టులో వేసి వచ్చాను. ఎంతో ఉపజ్ఞతో కథను సృష్టించిన వాడిని నేనే అయినప్పటికీ కాలాన్ని అనుసరించి కేవలం అనువాదకుని హోదాలోకి దిగవలసివచ్చింది. ఏం జేస్తాం?—ఏ యెండకా గొడుగు పట్టాలిగా!

కథ పోస్టులో వెళ్ళిపోయింది ఆ నెలకూడా కాలగర్భంలో కలిసిపోయింది. మరుసటి నెలలో కూడా వారం రోజులు గడిచిపోయాయి. నాకు ఎన్నాళ్ళకూ పత్రిక రాలేదు. కొంతమంది రచనలు వేసుకొనికూడా రచయితలకు సంచిక పంపించరు. ఈకొత్త సంపాదకుడుకూడా అటువంటి తరగతికి చెందినవాడేమో ననుకున్నాను.

ఒకవేళ పత్రికా పుత్రికను ప్రసవించలేక ఇంకా నొప్పులు పడుతూనే ఉన్నాడేమో!

చివరకు ఒకనాడు పుస్తకాలషాపులోకి వెళ్ళేటప్పటికి—అక్కడ మామూలుగా రోజూ సమావేశమౌతూ ఉండే కవులు, స్థానిక రాజకీయజ్ఞులు, జ్యోతిష్కులు—అందరూ నా 'ఛకోవ్ కథ'ను గురించే చెప్పుకుంటూ ఉండటం నాకు ఆనందం కలిగించింది—

ఒక అభ్యుదయసాహిత్య శిరోమణి కాబోలు అంటున్నాడు—"ఛకోవ్ రష్యాలో చాల ఘాటుగా రాసేవాళ్ళలో ఒకడండీ! కథాసాహిత్యంలో ఝుకోవ్ తరువాత ఛకోవ్ నే చెప్పుకోంటారు..." ఎంతసేపటికీ ఆ ఛకోవ్ ను గురించే ప్రశంసిస్తాడుగాని, వాడికి ఆ పేరుబయటకు తెచ్చిన నన్ను గురించి ఎవడూ అనుకోడే!

ఆ కొత్త పత్రిక ఊళ్లో అమ్మకానికి వచ్చిందని తెలిసివెళ్లి కొనుక్కొచ్చి చూశాను. నాకథ అచ్చువేశారు. 'ప్రఖ్యాత రష్యన్ రచయిత ఛకోవ్ కథకు అనువాదం'—అన్నాడేగాని అనువాదకుడైన నా పేరెక్కడా లేదు.

అదిగదీ! నా పేరులో ఉందన్నమాట నా దురదృష్టమంతా!

పేరులో యేముంది?— అంటారు చాలమంది చూడండి—నా పేరంటే ప్రతిపత్రికాధిపతికీ ఎంత ఈసడింపో!

అందుకనే అనాటికో చిన్నప్పుడు పెట్టిన పేరు మార్చేస్తున్నాను.